సాక్షి నాగర్‌కర్నూల్

శనివారం, 9, ఆగస్టు, 2025



సెల్ఫీ విత్ రాఖీ

బంధాన్ని బలోపేతం చేస్తూ.. అనుబంధాల మాధుర్యాన్ని పెంచేదే రాఖీ. ఈరక్షాబంధన్ రోజున మీ తోబుట్టువులకు రాఖీ కడుతూ సెల్ఫీ తీసి 'సాక్షి'కి పంపించండి. మీఫొటోను మేం ప్రచురిస్తాం. సెల్ఫీతోపాటు పేరు, గ్రామం, జిల్లా, వివరాలు ఈ నంబర్‌కు వాట్సాప్ చేయండి.

సెల్ఫీ పంపాల్సిన వాట్సాప్ నంబర్

94930 80108

న్యూస్‌రీల్

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని జెడ్పీ **బాలుర** ఉన్నత పాఠశాల ఆవరణలో **ఆదివారం** జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు **నిర్వహిస్తు**న్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి స్వాములు శుక్రవారం తెలిపారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో జరిగే పోటీలకు ఆసక్తిగల బాలురు, బాలికలు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా. రమేష్‌చంద్ర హాజరవుతున్నట్లు చెప్పారు. ఈ నెల 30, 31న పాలమూరు యూనివర్సిటీలో జరిగే 11వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎంపికై న క్రీడాకారులు పాల్గొననున్నట్లు వివరించారు.

11 నుంచి సదరం క్యాంపులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 11 నుంచి సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామని.. దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ చిన్న ఓబులేషు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక దివ్యాంగులకు 11, 18, 22, 25, 29 తేదీలు, వినికిడి లోపం ఉన్న దివ్యాంగులకు ఈ నెల 12న, కంటిచూపు లోపం ఉన్న వారికి 11, 25 తేదీలు, మానసిక దివ్యాంగులకు 18, 28 తేదీల్లో ఉదయం 10 గంటలకు క్యాంపు ఉంటుందని వివరించారు. క్యాంపునకు వచ్చేవారు ముందుగానే మీ–సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకొని సంబంధిత తేదీల ప్రకారం మెడికల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

కేఎల్ఐ డీ-63 కాల్వకు గండి

కల్వకుర్తి రూరల్: గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని వెంకటాపూర్ సమీపంలో ఉన్న కేఎల్ఐ డీ–63 డిస్ట్రిబ్యూటరీ కాల్వకు గండి పడినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో నీరు వృథా కావడమేగాక పంటలకు నష్టం వాటిల్లుతోందని.. అధికారులు స్పందించాలని రైతులు కోరారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన



తాడూరు: మండలంలోని ఇంద్రకల్ రైతువేదికలో శుక్రవారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఉద్యాన అధికారి వెంకటేష్ హాజరై ఆయిల్‌పాం, తీగజాతి కూరగాయలు, వెదురు సాగు, నీటికుంటల నిర్మాణం గురించి వివరించారు. అలాగే పైలెట్ ప్రాజెక్టు కింద గ్రామంలో రైతు రమణ సాగుచేసిన ఆయిల్‌పాం తోటను సందర్శించారు. ఉద్యాన అధికారి జగన్, డీజీఎం మల్లేష్, కేవీకే పాలెం అధికారి ఆదిశంకర్, సందీప్‌కుమార్‌రెడ్డి, ఫణికుమార్, రాకేష్, భార్గవ్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బీజేపీలోకి గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తన అనుచర గణంతో ఆదివారం ఉదయం 10 గంటలకు బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం ఆయనే స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఇతర కీలక నేతల సమక్షంలో చేరుతున్నట్లు వివరించారు. తొలుత 11వ తేదీన చేరుతున్నట్లు వార్తలు వచ్చాయి.

విస్తరణ వేగవంతం

కల్వకుర్తి–నంద్యాల ఎన్‌హెచ్‌–167కే పనుల్లో పురోగతి



కొల్లాపూర్ - సోమశిల మధ్యలో కొనసాగుతున్న జాతీయ రహదారి పనులు

- జనవరి నాటికి పూర్తిచేసేలా కార్యాచరణ
- వచ్చే నెలలో సోమశిల వంతెన నిర్మాణానికి టెండర్లు
- రెండేళ్ల సమయం పట్టొచ్చని అంచనా

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణతో ఆయా ప్రాంతాల రూపురేఖలు మారిపోనున్నాయి. ఇప్పటికే కొనసాగుతున్న కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి 167కే పనుల్లో వేగం పుంజుకుంది. కల్వకుర్తి మండలం కొట్ర చౌరస్తా నుంచి కొల్లాపూర్ వరకు వివిధ దశల్లో పనులు శరవేగంగా సాగుతున్నాయి. కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ వరకు రహదారి విస్తరణ దాదాపు పూర్తి కావస్తుండగా, నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ మధ్యలో కొన్నిచోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మండల కేంద్రాలు, గ్రామాల వద్ద రెయిలింగ్, పేవ్‌మెంట్లు, వంతెనల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి రహదారి నిర్మాణం పూర్తి చేయాలనే సంకల్పంతో అధికారులు పనులు కొనసాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కల్వకుర్తి–నంద్యాల, జడ్చర్ల–కోదాడ, మహబూబ్‌నగర్ బైపాస్ జాతీయ రహదారుల నిర్మాణాలతో రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనుంది.

ఐకానిక్ వంతెనకు టెండర్లు..

కల్వకుర్తి – నంద్యాల జాతీయ రహదారి 167కే పనుల్లో భాగంగా కొల్లాపూర్ సమీపంలోని సోమశిల వద్ద కృష్ణానదిపై ఐకానిక్ వంతెన నిర్మాణం చేపట్టాల్సిఉంది. ఈ వంతెన నిర్మాణానికి నెలరోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని జాతీయ రహదారులశాఖ అధికారులు చెబుతున్నారు. రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది.

11 కి.మీ. మేర మహబూబ్‌నగర్ బైపాస్..

మహబూబ్‌నగర్ బైపాస్ నిర్మాణానికి ఇటీవల కేంద్రం ఆమోదం తెలిపింది. మహబూబ్‌నగర్ శివారులోని అప్పన్నపల్లి వద్దనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నుంచి హన్వాడ మండలం చిన్నదర్పల్లి మీదుగా చించోలి జాతీయ రహదారి వరకు అనుసంధానం చేసేందుకు బైపాస్ రహదారి నిర్మించనున్నారు. సుమారు 11 కి.మీ. మేర రహదారి నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నారు.

మారనున్న రూపురేఖలు..

ఇప్పటికే కల్వకుర్తి నుంచి తాడూరు వరకు నాలుగు వరుసల రహదారి పనులు పూర్తయ్యాయి. తాడూరు నుంచి నాగర్‌కర్నూల్ సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా వరకు పనులు పెండింగ్‌లో ఉండగా, నాగర్‌కర్నూల్ నుంచి పెద్దకొత్తపల్లి మీదుగా కొల్లాపూర్ వరకు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కొల్లాపూర్ సమీపంలోని సింగోటం చౌరస్తా నుంచి కృష్ణా తీరంలోని సోమశిల వరకు రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెరిగింది. మరో ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. సోమశిల వద్ద ఐకానిక్ వంతెన నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం కొత్తరూపు సంతరించుకోనుంది.



పెద్దకొత్తపల్లిలో జరుగుతున్న జాతీయ రహదారి 167కే పనులు

జడ్చర్ల–కోదాడ రోడ్డు విస్తరణ..

ఉమ్మడి జిల్లాలోని జడ్చర్ల నుంచి కల్వకుర్తి, మల్లేపల్లి, హాలియా, అలీనగర్, మిర్యాలగూడ మీదుగా కోదాడ వెళ్లే ఎన్‌హెచ్–167 రహదారిని రెండు వరుసల నుంచి నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు రెండు వరుసలుగా ఉండటంతో వాహనాల రద్దీ పెరిగి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డును సుమారు 219 కి.మీ. మేర నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యం పెరిగి వాణిజ్యం మరింత ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి.

ప్రజా ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు



లబ్ధిదారుకు రేషన్‌కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ముందుందని ఎమ్మెల్యే డా. రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి నియోజకవర్గంలోని నాగర్‌కర్నూల్, తెలకపల్లి, తాడూర్, బిజినేపల్లి, తిమ్మాజీపేట మండలాల లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేసి మాట్లాడారు. దేశంలో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జిల్లాలో అర్హులైన పేదలకు ఆహార భద్రత కల్పించి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చిన 19 నెలల్లోనే జిల్లాకేంద్ర అభివృద్ధికి రూ.40 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. సన్న బియ్యాన్ని కొందరు డీలర్లు అమ్ముకుంటున్నట్లు ఫిర్యాదు అందాయని.. అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

❐ జిల్లాలోనే మొదటి ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశాన్ని శుక్రవారం తిమ్మాజీపేట మండలం ఇప్పలపల్లిలో నిర్వహించినట్లు చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్‌కార్డులు జారీ చేయకపోవడంతో సంక్షేమ పథకాలు అందలేదని, రాజీవ్ ఆరోగ్యశ్రీ లాంటి పథకాలను వినియోగించుకోలేక పోయారన్నారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 6,600 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. అలాగే పాత రేషన్ కార్డుల్లో అదనంగా 16 వేల మంది పేర్లను నమోదు చేశామన్నారు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని.. మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుంటే వెంటనే రేషన్ కార్డును జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి నరసింహారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, ఆర్డీఓ సురేష్‌బాబు, తహసీల్దార్లు తబితారాణి, జాకీర్ అలీ, మునీరుద్దీన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఐదు మండలాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

'సఖి' సేవలపై విస్తృత ప్రచారం

'సఖి' కేంద్రాల సేవలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమీపంలోని సఖి కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. బాధితులకు అందించిన న్యాయ, వైద్య, వసతి ఇతర సదుపాయాల గురించి కో–ఆర్డినేటర్ సునీతను అడిగి తెలుసుకున్నారు. జూలై చివరి నాటికి 2,343 కేసులు నమోదు చేశామని, 19 కేసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, 16 కేసులు విచారణ దశలో ఉన్నాయని కో–ఆర్డినేటర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికలు వివిధ రకాల వేధింపులు, హింసలకు గురవుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో వారికి అవసరమైన అన్నిరకాల సాయం అందించి తాత్కాలిక ఆశ్రయం కల్పించేలా సఖి కృషి చేస్తోందన్నారు. మహిళల భద్రత, హక్కుల పరిరక్షణకు కేంద్రం ముఖ్యపాత్ర పోషిస్తోందని తెలిపారు. కేంద్రాన్ని పరిశుభ్ర వాతావరణంలో అన్ని వసతులతో కొనసాగిస్తున్న సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఆయన వెంట జిల్లా బాలల హక్కుల సంరక్షణ చైర్మన్ లక్ష్మణ్‌రావు, సఖి సెంటర్ సిబ్బంది ఉన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ..

సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ బదావత్ సంతోష్ తనిఖీ చేసి సీలు, అక్కడి సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవికుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

కార్యకర్తల సంకల్పం గొప్పది

- అచ్చంపేట పార్టీ శ్రేణులే రాష్ట్రానికి ఆదర్శం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి.. చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

అచ్చంపేట: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మీద కోపంతో కాంగ్రెస్‌కు ఓట్లు వేయలేదని.. ఇచ్చిన మోసపూరిత హామీలను నమ్మి ఓట్లేసి ఇప్పుడు ఎంతో బాధపడుతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనం నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన జరగగా ఆయనతో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు కేసీఆర్‌కు అండగా ఉన్నారని, ఇందుకు నిదర్శనం అచ్చంపేటలో నాయకుడు వెళ్లిన తర్వాత జరిగిన పరిణామాలేనని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలకు రెండునెలల ముందుగా ప్రాజెక్టులకు నీళ్లొచ్చినా.. రైతులకు సాగునీరు వదలకుండా సముద్రంలోకి వదిలారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సంఘటితంగా ఉండి పార్టీ అభ్యర్థులను అత్యధిక సంఖ్యలో గెలిపించుకొని సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. నాయకుడు పార్టీ మారాలంటే భయపడే పరిస్థితిని అచ్చంపేట కార్యకర్తలు కల్పించారన్నారు.

హామీలు విస్మరించి అబద్ధాలతో పాలన..

రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘనత వారికే దక్కుతుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ధ్వజమెత్తారు. విద్యుత్ కోతలు, భూములు, ప్లాట్ల ధరలు భారీగా పడిపోయావని.. అవసరానికి భూములు అమ్ముదామన్నా కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించి.. అబద్ధాలతో పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే కేసులతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కరుడుగట్టిన కార్యకర్తల ఆదరణ ఉన్నా.. గువ్వల బాలరాజు లాంటి నాయకుడు పార్టీ మారడం అవివేకమని, ఓ రకంగా ఆయన పతనానికి ఆయనే కారణమయ్యారని తెలిపారు. మాజీ మంత్రి డా. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గువ్వల పార్టీ మారడం దురదృష్టకరమని, నాయకుడు కార్యకర్తలకు భరోసా కల్పించేలా ఉండాలన్నారు. రాష్ట్రంలో రానున్నది బీఆర్‌ఎస్ పాలనేనని.. కేసీఆర్ పాలనలో తెలంగాణ స్వర్ణయుగమన్నారు.

28న అచ్చంపేటలో కేటీఆర్ సభ

ఈ నెల 28న అచ్చంపేటలో కేటీఆర్ బహిరంగ సభ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల వారీగా కార్యకర్తలను కలుస్తామని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ కూటమిగా ఏర్పడి బీఆర్‌ఎస్ మీద దండయాత్ర చేస్తున్న సమయంలో గువ్వల పార్టీని వీడి కార్యకర్తలకు అన్యాయం చేశారని పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. బంగారు తెలంగాణగా మార్చిన కేసీఆర్‌ను చూసి పార్టీలోకి వచ్చానని.. నా మీద గువ్వల ఎందుకు నిందలు వేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్ హర్షవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు పోకల మనోహర్, అభిలాష్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్లు కె.తులసీరాం, నర్సింహగౌడ్, మాజీ ఎంపీపీలు పర్వతాలు, కరుణాకర్‌రెడ్డి, కట్టా గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్ భీమా, అమీనోద్దీన్, రమేష్‌రావు, అంతటి శివ తదితరులు పాల్గొన్నారు.

'రక్షా'నుబంధం

నేడు రక్షాబంధన్ వేడుకలు

- ప్రేమానుబంధాలను చాటుతున్న రాఖీ పండుగ
- ఆధునిక కాలంలోనూ ఆదరణ తగ్గని వైనం
- కొరియర్ల ద్వారా తమ వారికి రాఖీలు పంపిస్తూ సంబరం
- సోషల్ మీడియాలోనూ శుభాకాంక్షల వెల్లువ

అక్కాతమ్ముళ్లు.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకొనేదే రాఖీ పండుగ. సోదరి తన సోదరుడు ఉన్నతంగా ఉండాలని కోరుకుంటే.. సోదరి కట్టిన రక్షాబంధాన్ని స్వీకరించిన సోదరుడు తానెప్పుడూ సోదరికి రక్షగా ఉంటానని ఈ పండుగ ద్వారా తెలియజేస్తారు. సమాజంలో నానాటికి బంధాలు చెదిరిపోతున్న తరుణంలో రక్షాబంధన్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలను బలోపేతం చేస్తుంది. సోదర, సోదరీమణుల మధ్య ఉండే అనుబంధాలు.. ప్రేమానురాగాలకు అద్దం పట్టే పండుగ కావడంతో మానవ సంబంధాల మెరుగు, విచక్షణకు ఇది ఎంతో దోహదం చేస్తుంది. ఆత్మీయుల మధ్య అనుబంధానికి, ఐకమత్యానికి, పరస్పర సహకారానికి చిహ్నంగా నిలుస్తుంది రాఖీ. ఆధునిక కాలంలోనూ ఎక్కడ ఉన్నా తమ అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు.. అక్కాచెల్లెళ్లు తరలివస్తుంటారు. అలాగే విదేశాల్లో ఉన్నవారు సైతం కొరియర్‌లోనూ తమవారికి రాఖీలు పంపిస్తూ.. అనుబంధాలను చాటి చెబుతున్నారు. ఇక సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్ట్రాగాంలోనూ శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

– స్టేషన్ మహబూబ్‌నగర్/ అచ్చంపేట/కందనూలు



400 ఏళ్ల పండుగ

రాఖీ పండుగంటే సాధారణంగా అక్కాచెల్లెళ్లు, తమ సోదరులకు రాఖీలు కట్టి వేడుకగా చేసుకుంటారు. అయితే అచ్చంపేటలో పద్మశాలీలు మాత్రం వినూత్నంగా జరుపుకొంటారు. రాఖీ పండుగను నూలు పుట్టిన పండుగగా నిర్వహిస్తారు. ఇది 400 ఏళ్ల నుంచి వస్తున్న ఆనవాయితీ. పురాణాల్లో నూలు గురించి ఉంది. ఈ రోజు నూలు పుట్టిందని, నూలుతో తయారు చేసిన కంకణం కట్టుకొని చేపట్టే ప్రతి కార్యంలో సకల శుభాలు కలుగుతాయని పద్మశాలీల నమ్మకం. మార్కెట్లో ఎన్ని రకాల రాఖీలు వచ్చినా పద్మశాలీలు మాత్రం పత్తి నుంచి తయారు చేసిన నూలు కంకణాన్ని చేతికి కట్టుకోవడం ఆనవాయితీ.

గాయత్రీ మాలధారణ..

పత్తితో తయారు చేసిన దారంతో కంకణం ధరించడమే కాకుండా.. జంధ్యం (గాయత్రిమాల)కూడా ధరిస్తారు. ముందుగా గాయత్రి హోమం నిర్వహించిన తర్వాత పద్మశాలీలంతా నూలుతో తయారు చేసిన జంధ్యాలను 43 ఏళ్లు సామూహికంగా ధరిస్తారు. అనంతరం పూజలు నిర్వహిస్తారు. స్థానిక భక్తమార్కండేయ ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం 44వ నూలు పూర్ణిమకు ఏర్పాట్లు చేస్తున్నారు.



అచ్చంపేట భక్త మార్కండేయ ఆలయంలో గాయత్రిమాల ధరిస్తున్న పద్మశాలీలు

నిష్టతో తయారు..



నిష్టగా ఉండి నూలుతో తయారు చేసిన కంకణం, జంధ్యం ధరిస్తాం. ఇవి సంప్రదాయంతోపాటు శుభానికి సూచికగా భావిస్తాం. ఈ సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు కొనసాగిస్తున్నాం. పద్మశాలీలు అనాదిగా రాఖీ పౌర్ణమిని నూలు పుట్టిన దినంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

– కిశోర్, ప్రధాన కార్యదర్శి, పద్మశాలి సంఘం, అచ్చంపేట

ఆనందంగా జరుపుకొంటాం..



సోదర, సోదరీమణులు ఉత్సాహంగా జరుపుకొనే పండుగ రాఖీ. నేను ప్రతి ఏటా పండుగకు ఊరెళ్లి తమ్ముడికి తప్పకుండా రాఖీ కడతా. ఈ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకొంటాం.

– స్వప్న, రాఘవేందర్‌కాలనీ, నాగర్‌కర్నూల్

గిరాకీలు పెద్దగా లేవు..



ఈ ఏడాది రాఖీ గిరాకీలు పెద్దగా లేవు. అందరూ ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. గతేడాది కంటే ఈసారి 50 శాతం గిరాకీ తగ్గింది.

– సురేందర్‌రావు, సాయి తిరుమల జిరాక్స్, నాగర్‌కర్నూల్



నాగర్‌కర్నూల్‌లోని శ్రీపురం చౌరస్తాలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

అన్నయ్య, తమ్ముడికి..

మార్కెట్లో వివిధ డిజైన్లలో రాఖీలు లభిస్తున్నాయి. ముఖ్యంగా అన్నయ్య, తమ్ముడు పేర్లతో వచ్చిన రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. చిన్నారులకు సంబంధించి వినూత్నంగా రాఖీలు మార్కెట్లో లభిస్తున్నాయి. అదేవిధంగా మెటల్, కుందన్, ప్రింటెడ్, హ్యాండ్‌మేడ్, వుడన్, ఫ్యాషన్ బోటిక్, యాక్సెసిరీస్, మోటోపట్లు తదితర రకాల రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. లైట్ వెయిట్‌తో ఉన్న రాఖీల నుంచి కొంతమేర పెద్దసైజు గల రాఖీలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్లో వివిధ రకాల డిజైన్లను బట్టి రూ.10 నుంచి రూ.500 వరకు రాఖీలు లభిస్తున్నాయి.

28 ఏళ్ల నుంచి..

జిల్లాకేంద్రానికి చెందిన చిట్టెమ్మ 1997లో మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా నియామకమైంది. తనకు ఎంతో ఇష్టమైన రాఖీ పండుగను తోటి కండక్టర్లు, డ్రైవర్లతో జరుపుకోవాలనే ఉద్దేశంతో అదే ఏడాది నుంచి రాఖీలు కట్టడం ప్రారంభించింది. డిపోలోని దాదాపు 220 మందికిపైగా డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి కులమతాలకతీతంగా రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుతోంది. రాఖీపండుగ వచ్చిందంటే డిపోలోని అందరూ చిట్టెమ్మ కట్టే రాఖీ కోసం ఎదురుచూస్తుంటారు. ఈ సందర్భంగా చిట్టెమ్మ 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రతి ఏడాది రాఖీ పండుగ రోజు ఆర్టీసీ ఉద్యోగులందరికీ రాఖీలు కడతానని, రిటైర్డ్ అయ్యే వరకు రాఖీ పండుగ రోజు ఎంత బిజీగా ఉన్నా డిపోలోని ఉద్యోగులందరికి రాఖీలు కడతానని పేర్కొన్నారు.



డిపోలోని ఉద్యోగులకు రాఖీలు కడుతున్న చిట్టెమ్మ

క్లుప్తంగా

తనయుడి చేతిలో తండ్రి హత్య

● కుమారుడికి సైతం గాయాలు



మృతుడు కృష్ణయ్య

నవాబుపేట: తనయుడి చేతిలో తండ్రి దారుణ హత్యకు గురికాగా ఈ సంఘటనలో తనయుడికి సైతం గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కామారం గ్రామానికి చెందిన చిలుక కృష్ణయ్య(54) 2015 సంవత్సరంలో తన భార్యను హత్య చేసి జైలుకు వెళ్లాడు. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత రెండేళ్ల క్రితం జిల్లాకేంద్రంలో ఒక మహిళను వేధించిన కేసులో సైతం జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో గతేడాది జైలు నుంచి ఇంటికి వచ్చిన కృష్ణయ్య తన కుమారుడు వెంకటేష్‌తో గొడవ పడటం మొదలుపెట్టాడు. కుమారుడి పేరుమీద ఉన్న 30 గుంటల భూమిని తన పేరున చేయాలని వేధింపులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం తెల్లవారుజామున తన తండ్రి ఇంట్లో తలుపులు మూసుకుని ఉండగా తెరవాలని కుమారుడు చెప్పగా.. తలుపు తెరిచిన వెంటనే కొడుకు వెంకటేష్‌పై దాడి చేశాడు. దీంతో కుమారుడు సైతం ఎదురు దాడిచేశాడు. ఈ క్రమంలో తలుపు పక్కనే ఉన్న రోకలిబండతో కుమారుడు దాడి చేయడంతో తండ్రి కృష్ణయ్య అక్కడిక్కడే మృతిచెందాడు. తండ్రి దాడిలో కుమారుడి తలకు సైతం తీవ్రగాయాలు కావడంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కృష్ణయ్య సోదరుడు చెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి అంత్యక్రియలు



బిజినేపల్లి: వట్టెం రిజర్వాయర్‌లో లభ్యమైన ఒక గుర్తు తెలియని మృతదేహానికి బిజినేపల్లి పోలీసులు శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించారు. బుధవారం వట్టెం రిజర్వాయర్‌లో 35నుంచి 40 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కుళ్లిపోయిన మృతదేహంపై పోలీసులు కేసు నమోదు చేసి నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో ఉంచారు. మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో శుక్రవారం మండల శివారులోని కేఎల్ఐ కాల్వ సమీపంలో అంత్యక్రియలు నిర్వహించారు. కానిస్టేబుల్ జితేందర్ రూ.6వేల సొంతడబ్బుతో అంత్యక్రియలు నిర్వహించడంతో ప్రజలు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



యాదగిరి మృతదేహం

అడ్డాకుల: అడ్డాకుల శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై స్నేహ చికెన్ ఎగుమతుల పరిశ్రమ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. దేవరకద్ర మండలం బస్వాయపల్లికి చెందిన యాదగిరి(45) గురువారం రాత్రి కొత్తకోట వైపు నుంచి అడ్డాకుల వైపు హైవేపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన యాదగిరిని స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. గురువారం మృతుని కుటుంబ సభ్యులు సమాచారం అందుకుని అడ్డాకుల పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



అస్లాం

ఊట్కూరు: మండలంలోని పగిడిమారి గ్రామానికి చెందిన అస్లాం (35) అనే రైతు గురువారం రాత్రి పొలం వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. గురువారం సాయంత్రం 4 గంటలకు పొలానికి వెళ్లిన అస్లాం స్టార్టర్ పెట్టి బాగు చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి వరకుఇంటికి రాకపోవడంతో భార్య షబానాబేగం పొలం వద్దకు వెళ్లి చూడగా భర్త కిందపడి ఉండడంతో స్థానికుల సహాయంతో చికిత్స కోసం నారాయణపేట ఆస్పత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

బ్రహ్మగిరి ప్రధాన రహదారిలో చిరుత

దోమలపెంట: బ్రహ్మగిరి (దోమలపెంట) గ్రామంలోని శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిలో ఓ ఇంటి వద్ద ఉన్న కుక్కపై చిరుత శక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో దాడి చేసి చంపి తిని కళేబరాన్ని వదిలేసి వెళ్లింది. చిరుత ప్రధాన రహదారిపైకి రావడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

అడవి బిడ్డల అరణ్య రోదన

చెంచులది ఇంకా అనాగరిక జీవనమే!

● గూడెంలలో కనీస వసతులు కరువు
● దృష్టి సారించని అధికార యంత్రాంగం
● నేటికీ మెరుగైన వైద్య సేవలకు నోచుకోని గిరిజనులు
● నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



చెంచులు నివశిస్తున్న బొడ్డు గుడిసెలు

అచ్చంపేట: ప్రపంచం మొత్తం 4జీ, 5జీ అని కాలంతో పరుగులు తీస్తుంటే నల్లమల చెంచుల జీవనం మాత్రం ఆదిమ యుగంలోనే ఆగింది. అమ్రాబాద్ అభయారణ్యంలో పులులు, వన్యప్రాణుల మధ్య జీవనం కొనసాగిస్తున్న ఆదివాసీ చెంచుల జీవన శైలిలో నాటికి, నేటికి ఎలాంటి మార్పు లేదు. ఇక్కడే పుట్టి, అడవే సర్వస్వంగా తరతరాలుగా ఉంటున్న చెంచులకు కనీస సౌకర్యాలు కరువై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం, చలి, ఎండలను లెక్కచేయక బొడ్డు గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. రవాణా, విద్యుత్, తాగునీరు, మెరుగైన వైద్యం అందక అల్లాడుతున్నారు. చెంచుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు శ్రమను దోపిడీ చేస్తుంటే.. మరికొందరు వారి హక్కులను కాలరాస్తూ లబ్ధిపొందుతున్నారు. మరో వైపు అటవీ సంరక్షణ పేరుతో అధికారులు వారిపై జులుం ప్రదర్శిస్తున్నారు.

ఐటీడీఏ పరిధిలో..

మన్ననూర్ సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలో నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్గొండ, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు ఉన్నాయి. ఐదు జిల్లాలోని 25 మండలాల్లో ఉన్న 172 గిరిజన ప్రాంతాల్లో 14,194 మంది గిరిజనులు ఉన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో 88 చెంచుపెంటల పరిధిలో 2,595 కుటుంబాల్లో 8,784 చెంచులు నివసిస్తున్నాయి. వీరిలో 4,341 మంది పురుషులు, 4,443 మంది మహిళలు ఉన్నారు. అభయారణ్యం పరిధిలో లింగాల, అమ్రాబాద్, పదర మండలాలు ఉండగా 18 చెంచు పెంటలు ఉండగా.. 320 కుటుంబాలు ఉన్నాయి. 12 పెంటల్లో పూర్తిగా చెంచులే ఉండగా.. మిగతా పెంటల్లో చెంచులతో పాటు ఎస్సీ, ఎస్టీలు ఉంటారు.

ఆర్భాటం తప్పా.. అభివృద్ధి లేదు

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వచ్చిందంటే చాలు ఆ రోజు ఐటీడీఏ, ఆర్డీటీ సంస్థ, ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తారు. కానీ మరుసటి రోజు నుంచి వారి గురించి ఆలోచించే తీరిక కూడా అధికారులకు ఉండదు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు వారికి ఇంకా ఆమడదూరంలోనే ఉన్నాయి. పోషకాహారం లోపంతో మహిళలు, చిన్నారులు మృత్యువాత పడుతుండగా మరికొందరు వివిధ వ్యాధులతో కాలం నెట్టుకొస్తున్నారు. వీరికి మౌలిక వసతులు కల్పించేందుకు బడ్జెట్‌లో రూ.కోట్లు ఖర్చు పెడుతున్నట్లు లెక్కలు చూపుతున్నా.. అవి ఎక్కడికి పోతున్నాయే ఇప్పటికీ ప్రశ్నార్థకమే. తమ సమస్యలు పరిష్కరించాలని సేవా సంఘం ఆధ్వర్యంలో ఎన్నోసార్లు పాదయాత్రలు, ధర్నాలు, నిరాహారదీక్షలు చేశారు. అయినా ఫలితం మాత్రం లేదు. అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలోని లోతట్టు అటవీ ప్రాంతంలోని చెంచుపెంటల్లో నివసించే వారి పరిస్థితి దుర్భరంగా తయారైంది.

చీకట్లో జీవనం..

కండ్లకుంట, గీసుగండి, పర్హాబాద్, మల్లాపూర్, పుల్లాయిపల్లి, ఆగర్లపెంట, రాంపూర్, అప్పాపూర్, బౌరాపూర్, మేడిమల్కల, ఈర్లపెంట, సంగడిగుండాలు, తాటిగుండాలు, పందిబొర్రె తదితర చెంచుపెంటలు రాత్రివేళ అధకారంలో ఉంటాయి. ఈ చెంచు పెంటలన్నీ (అప్పాపూర్) ఒకే దగ్గరికి చేర్చి వారికి విద్యుత్ సదుపాయం కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం అటవీశాఖ నిబంధనలతో నీరుగారుతోంది. రాత్రివేళ చెంచులు బొడ్డు గుడిసెలో కట్టెల మంటలు (నెగడి) పెట్టి కాలం వెల్లదీస్తున్నారు. నెగడే చెంచులకు అడవి జంతువుల నుంచి రక్షణగా నిలుస్తోంది. సోలార్ వ్యవస్థతో విద్యుత్ దీపాలు అమర్చినా చాలా వరకు అవి పనిచేయడం లేదు.

అందని వైద్య సేవలు..

నల్లమలలోని చెంచులు అధికంగా రోగాలతో బాధపడుతున్నారు. రక్తహీనత, టీబీ, మలేరియా, విషజ్వరాలు, క్యాన్సర్, కడుపులో బల్ల (గడ్డ) వ్యాధులు లేని కుటుంబం అంటూ లేదు. చెంచులు సరైన ఆహారం తీసుకోకుండా సారాను అధికంగా తాగుతుండడంతో రోజురోజూ వారి ఆరోగ్యం క్షీణిస్తోంది. చెంచులకు చికిత్స అందించడం కోసం అప్పాపూర్‌లో ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు చేసినా అది తెరుచుకోవడం లేదు. మన్ననూర్ కేంద్రంగా పనిచేసిన సంచార వైద్యశాల(ఎంఎం యూనిట్) సేవలు నిలిచిపోయాయి. ఈ యూనిట్ సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి పరిమితమయ్యారు. వట్టవర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సేవలు కొనసాగిస్తున్నా అంతంత మాత్రంగానే అందుతున్నాయి.

ఆదివాసులను అవమానపర్చడమే..



మాట్లాడుతున్న చిగుర్ల మల్లికార్జున్

మన్ననూర్: ఈ నెల 9న నిర్వహించాల్సిన ప్రపంచ ఆదివాసి దినోత్సవం వేడుకలను 12న నిర్వహిస్తామనడం ఆదివాసీలను అవమానపర్చడమే అవుతుందని ఆదివాసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లికార్జున్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఎలా సమర్థించుకుంటారో ఐటీడీఏ పీఓ రోహిత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు.

కురుమూర్తిలో వైభవంగా పవిత్రోత్సవాలు



కురుమూర్తిస్వామి ఆలయ యాగ మండపంలో కళశ పూజ చేస్తున్న పూజారులు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం శివారు కాంచన గుహంలో కొలువుదీరిన కురుమూర్తిస్వామి పవిత్రోత్సవాలనుశాస్త్రోతంగా వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాగశాల మండపంలో పూర్ణాహుతి, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. 108 కళశాలతో పూజలు నిర్వహించి స్వామివారు, ద్వారపాలకులు, అల్వార్లకు అభిషేకాలు చేశారు. కురుమూర్తి స్వామికి నూలువస్త్రాలతో తయారు చేసిన పవిత్రమాలలతో సుందరంగా అలంకరించారు. ప్రతిఏటా ఆలయ పూజారుల మంత్రోచ్ఛారణలతో నిర్వహించే ఈ నూలువస్త్రాల పవిత్ర కార్యక్రమం కనులపండువగా కొనసాగింది. చిన్నచింతకుంటకు చెందిన భక్తుడు బత్తుల బాలరాజు ప్రతిఏటా అందించే పవిత్రమాలలను ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తలపై ఉంచుకొని మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా యాగశాల మండపం నుంచి స్వామివారి ప్రధాన ఆలయం వరకు తీసుకొచ్చారు. స్వామివారికి పూజలు నిర్వహించి పవిత్రమాలలను పూజారులకు అప్పగించారు. పూజారులు పవిత్రమాలలతో స్వామివారిని సుందరంగా అలంకరించారు. స్వామివారు పవిత్రమాలల అలంకరణలో అత్యంత సుందరంగా దర్శనమిచ్చాడు. కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి వెంకటయ్య, అర్చకులు సత్యనారాయణ, అనంత విజయ్, శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు వెంకటేశ్వర్లు, నాగరాజు, కమలాకర్, భాస్కరచారి తోపాటు భక్తులు పాల్గొన్నారు.



కురుమూర్తి ఆలయం వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఘాట్ రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి

కురుమూర్తిస్వామి ఆలయ ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన ఆలయం వద్ద చేపట్టిన ఘాట్ రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. కురుమూర్తిస్వామి ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆలయం వద్ద ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.110 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

తాళాలు పగలగొట్టి రెండు ఇళ్లలో చోరీ

గద్వాల క్రైం: తాళం వేసిన రెండు ఇళ్లలో గుర్తు తెలియని దుండగులు చొరబడి రూ. 2లక్షల నగదు, 5 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన గద్వాల పట్టణంలోని జమ్మిచేడ్‌లో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఆంజనేయులు, భీసన్న శుక్రవారం ఉదయం ఇళ్లకు తాళం వేసి పొలానికి వెళ్లారు. ఉదయం 11 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి భీసన్న ఇంట్లో భద్రపరిచిన రూ. 2 లక్షల నగదు, ఆంజనేయులు ఇంట్లో 5 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించారు. స్థానికులు బాధితులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానిత వ్యక్తుల వివరాలపై ఆరా తీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపడుతున్నామని రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని కల్వకోల్ గ్రామ సమీపంలోని సింగోటం చెరువులో బుధవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. శుక్రవారం మృతదేహం ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. మండలంలోని చిన్నప్రావుపల్లి గ్రామానికి చెందిన పుట్ట మశన్న కుమారుడు పుట్ట రాముడు (28)గా గుర్తించారన్నారు. రాముడు కొల్లాపూర్ మండల పరిధిలోని కుడికిల్ల గ్రామంలో తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. పనికి వెళ్లకుండా జులాయి తిరుగుతున్నాడని పని చేసుకోమని తల్లి చిట్టెమ్మ మందలించడంతో మనస్థాపానికి గురై జూలై 29న ఇంటి నుంచి వెళ్లి కేఎల్ఐ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతదేహం సింగోటం చెరువులో ఈ నెల 6వ తేదీన కనిపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సినీ ఫక్కీలో బైక్‌ను వెంటాడి..



మద్యం దుకాణంలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితరులు

రూ.3 లక్షలు చోరీ

జడ్చర్ల: మోటార్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఇద్దరు గుర్తు తెలియని యువకులు స్కూటీపై వెంబడించి కళ్లల్లో కారం చల్లి నగదు బ్యాగును ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని కొత్తతండా వద్ద 167 నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సీఐ కమలాకర్ కథనం మేరకు.. జడ్చర్ల కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న రిది వైన్స్‌ను గురువారం రాత్రి బంద్ చేసి మద్యం అమ్మగా వచ్చిన డబ్బును బ్యాగులో సర్దుకుని క్యాషియర్ అరుణ్‌రెడ్డి తన మోటార్ బైక్‌పై మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నాడు. కొత్త తండా సమీపంలో రోడ్డుపై ఉన్న ట్రాఫిక్ స్టాపర్స్ వద్ద బైక్ స్లో కావడంతో వెంటనే వచ్చిన ఓ స్కూటీపై ఉన్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అరుణ్‌రెడ్డి కళ్లలో కారం చల్లి అతడి నుంచి నగదు ఉన్న బ్యాగును లాక్కుని మహబూబ్‌నగర్ వైపు పారిపోయారు. వెంటనే తేరుకున్న అరుణ్‌రెడ్డి వారిని వెనుక నుంచి వెంబడించాడు. స్కూటీపై ఉన్న దుండగులు తిరుమల హిల్స్ సమీపంలో యూటర్న్ చేసుకుని తిరిగి జడ్చర్ల వైపునకు వచ్చారు. అయితే జాలీ హిల్స్ వరకు వెంటాడిన అరుణ్‌రెడ్డి కింద పడిపోవడంతో దుండగులు తప్పించుకున్నారు. బ్యాగులో దాదాపుగా రూ.3 లక్షల నగదు ఉంటుందని బాధితుడు పోలీసులకు తెలిపాడు. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ కమలాకర్ వెంటనే స్పందించి గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. శుక్రవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీసీఎస్ సీఐ రత్నం మద్యం దుకాణానికి చేరుకొని విచారించారు. రహదారిపై చుట్టుపక్కల సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్

వెల్దండ: పందుల చోరీ కేసులో బెల్లంకొండ రాములును హత్య చేసిన నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. కల్వకుర్తి మున్సిపాలిటీలోని విద్యానగర్‌కు చెందిన రాములుకు చెందిన పందులు చోరీకి గురైన నేపథ్యంలో పందులు వెల్దండలోని మానసపాటి వెంకటమ్మ పందుల షెడ్డులో ఉన్నాయన్న విషయం తెలుసుకున్న రాములు షెడ్డు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో రాములు హత్యకు గురైనట్లు తెలిపారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు హత్యకు పాల్పడిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితులు మానసపాటి వెంకటమ్మ, కుమారులు అన్వేష్, శివ, పవన్‌ను కల్వకుర్తి కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కురుమూర్తి, ఏఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సీఐ కార్యాలయంలో హత్య వివరాలు వెల్లడిస్తున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

బీచుపల్లిలో విశేష ఆరాధన



యాగశాలలో హోమం చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాలలో భాగంగా మూడవరోజు సుదర్శన్ నారాయణన్ బృందం ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, పంచామృత అభిషేకం, విశేష ఆరాధన, యాగశాలలో కలిశారాదములు, మూలమంత్ర హోమాలు, సుదర్శన హోమం, నారసింహ హోమం, ఆలయంలో విగ్రహములకు గోపురములకు పవిత్రములు సమర్పణ, లఘుపూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్టి వంటి పూజలు చేశారు. అలాగే సాయంకాలం యాగశాల తిరువారాదన, నిత్య హోమం, మూలమంత్ర హోమాలు, మహాలక్ష్మి హోమం, లఘుపూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్టి, వంటి ప్రత్యేక పూజలను అర్చకులు వేద మంత్రాల నడుమ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, ఆలయ కమిటి సభ్యులు, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

భయం భయంగా 'కొత్తపాలెం'





మృతిచెందిన ఆవు, ఘటనా స్థలంలో అనుమానాస్పదంగా గుర్తు తెలియని జంతువు జాడలు

● గుర్తుతెలియని జంతువు దాడిలో మరో ఆవుమృతి
● కనిపిస్తున్నవి పులిజాడలేనని అనుమానాలు
● ఒకే రైతుకు చెందిన రెండు ఆవులు మృతి
● పట్టించుకోని ఫారెస్టు అధికారులు

ధరూరు: మండలంలోని కొత్తపాలెంలో గుర్తు తెలియని జంతువు దాడికి మరో ఆవు బలైంది. గురువారం గ్రామానికి చెందిన రైతు కొత్తింటి వెంకటప్ప పశువులను పొలం వద్ద కట్టేసి ఉంచగా.. గురువారం గుర్తు తెలియని జంతువు దాడిలో ఒక లేగదూడ మృతి చెందగా.. 24గంటలు గడవక ముందే మరో ఆవు మృతిచెందడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. అక్కడి జాడలను చూసి పులి అని గ్రామస్తులు చెబుతుండగా.. ఫారెస్టు అధికారులు మాత్రం ఏదీ తేల్చలేకపోతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద పనులు చేసుకునేందుకు కూడా జనం జంకుతున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయం గుప్పిట్లో పనులు చేసుకుంటున్నారు. శుక్రవారం ఫారెస్టు అధికారులు వచ్చి మృతిచెందిన ఆవును పరిశీలించారు. అతి భయంకరంగా పీల్చుకుతున్న దృశ్యాలను చూసి గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఏదిఏమైనా ఫారెస్టు అధికారులు నిఘా ఏర్పాటు చేసి పశువులను బలితీసుకుంటున్న జంతువు పులినా లేక ఐనా నా లేక మరే ఇతర జంతువా అనేది తేల్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పంటల ముఖ్య పోషకం.. నత్రజని

పాడి-పంట

జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్ : మనిషికి ఆహారం అవసరమైనట్లే మొక్కలకు ఆహారం తప్పనిసరి. మొక్కలు ఆహారాన్ని ధాతువుల రూపంలో తీసుకుంటాయి. వీటిని పోషకాలు అని కూడా పిలుస్తారు. మొక్క ఆరోగ్యంగా పెరగడానికి, ప్రత్యుత్పత్తికి 18 పోషకాలు అవసరమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ వివరించారు.

■ మొక్కల జీవన ప్రక్రియలో ప్రతి పోషకం ఓ ప్రత్యేకమైన పని నిర్వర్తిస్తుంది. అది లోపించినప్పుడు ఆ పని కుంటుపడుతుంది. దీంతో దిగుబడి కూడా తగ్గుతుంది.

పంట దిగుబడిలో నత్రజని పాత్ర: ఇది మొక్కకు కావాల్సిన ముఖ్య పోషకాలలో మొదటిది. పైరుకు దీని అవసరం మొదటి నుంచి చివరి వరకు ఉంటుంది. పత్ర హరితం జీవ పదార్థం కేంద్రక ఆమ్లాలలో నత్రజని ఒక భాగం. నత్రజనిని మొక్కలు అమ్మోనియం నైట్రేట్ రూపాలలో తీసుకుంటాయి. నత్రజని ప్రభావం పైరు పెరుగుదల మీద దుబ్బు చేయడంలోనూ కొమ్మలు తొడగడంలోనూ ఉంటుంది. పైరు మీద దీని ప్రభావం స్పష్టంగాను త్వరితంగాను కనిపిస్తోంది. నత్రజని వాడకం వలన మాంసకృతుల శాతం పెరుగుతుంది. మొక్క నిర్మాణానికి మూలమైన జీవ కణమైతే జీవ కణాల నిర్మాణానికి నత్రజని మూలాధారం.



నత్రజని లోపం ఉన్న వరి పైరు

నత్రజని అధికంగా వాడితే :

ముఖ్యమైన నత్రజనిని అవసరం మేరకే వాడాలి. అధికంగా అందిస్తే అనర్థాలకు దారి తీస్తుంది. ఎక్కువగా వాడితే పైర్లు విపరీతంగా పెరిగి పడిపోవడం, పూతకు ఆలస్యంగా రావడం, పంట కాలం పొడగించడం, తాలు గింజల శాతం పెరగడం, చీడపీడలకు సులభంగా గురికావడం అలాగే దిగుబడి తగ్గిపోవడం జరుగుతుంది.

నత్రజని లోపిస్తే : పెరుగుదల లోపించి మొక్కలు పొట్టిగా ఉండిపోవడం, ఆకులు వాలిపోయి పసుపు రంగుకు మారడం, ఫల సాయంతో మాంసకృత్తుల శాతం తగ్గిపోవడం జరుగుతుంది. లోపం తీవ్రంగా ఉన్నప్పుడు ఆకుల మొనల నుంచి మధ్య వరకు క్రమంగా మాడిపోవడం ముదురు ఆకులు ముందుగానే పసుపు రంగుకు మారి ఎండిపోయి రాలిపోతాయి.

నత్రజని అందించే ఎరువులు : నత్రజని అందించడానికి యూరియా, అమ్మోనియం సల్ఫేట్, కాల్షియం, అమ్మోనియం క్లోరైడ్ ఎరువులు వాడాలి. నత్రజని సులభంగా కొట్టుకుపోయే స్వభావం కలిగి ఉంటుంది. ఈ ఎరువుల వినియోగ ఫలితం 30-45 శాతం మాత్రమే. కాబట్టి ఈ ఎరువులు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి.

గాలి నుంచి మొక్కలకు సహజంగా లభించే పోషకాలు :

1) కార్బన్
2) ఆక్సిజన్
3) హైడ్రోజన్

ఈమూడింటిని మొక్కలకు ప్రత్యేకంగా అందించాల్సిన అవసరం లేదు. వాటంతట అవే లభిస్తాయి.

ముఖ్య పోషకాలు :

4) నత్రజని
5) భాస్వరం
6) పొటాష్

ఉప పోషకాలు :

7) కాల్షియం
8) మెగ్నీషియం
9) గంధకం

సూక్ష్మ పోషకాలు :

10) జింక్
11) రాగి
12) ఇనుము
13) మాంగనీస్
14) బోరాన్
15) మాలిబ్డినం
16) క్లోరిన్
17) సోడియం
18) కోబాల్టు

వెన్నాచేడ్‌లో 40 గొర్రెల అపహరణ

వారం వ్యవధిలో 78 గొర్రెలు చోరీ

మహమ్మదాబాద్: వారం వ్యవధిలో రెండు గ్రామాల్లో 78 గొర్రెలు అపహరణకు గురైన ఘటన మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అనెమోని మల్లయ్య, గంటల బుడ్డయ్య, దొంగల మల్లయ్యల గొర్రెలను జూలై 31న రాత్రి కొంరెడ్డిపల్లి మల్లయ్య పొలంలో మంద నిలిపారు. ఈ క్రమంలో మంద నుంచి 38 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. అదే విధంగా గురువారం రాత్రి 10 గంటలకు వెన్నాచేడ్ గ్రామ సమీపంలో గొర్రెల మందను నిలిపి మధ్య రాత్రి రెండు గంటలకు వచ్చి చూడగా గొర్రెల మంద కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతుకగా 100 మీటర్ల దూరంలో గొర్రెలు కనిపించాయి. మందలో 40 గొర్రెలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులుకు ఫిర్యాదు చేసినట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కాగా గురువారం రాత్రి 1.45గంటలకు వెంకట్‌రెడ్డిపల్లి నుంచి మహబూబ్‌నగర్ వైపు మేకలు తరలిస్తున్న వాహనం వెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు.